



## రూ.29 లక్షలకు మై హోం భూజా లడ్డూ..

నాలెడ్జ్ సిటీలోని మై హోం భూజా గేటెడ్ కమ్యూనిటీలో వినాయకుడి లడ్డూ ఈ ఏడాది రికార్డు స్థాయిలో రూ.29 లక్షలకు అమ్ముడుపోయింది. ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కొండపల్లి గణేశ్, సరిత దంపతులు కమ్యూనిటీలో నిర్వహించిన వేలంలో సొంతం చేసుకున్నారు. – కొండాపూర్, సెప్టెంబర్ 15



## మాతృశ్రీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

మాదాపూర్ డివిజన్ మాతృశ్రీ నగర్ కాలనీలోని మాతృశ్రీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణ నాథుని మండపంలో వినాయక లడ్డూ వేలం పాటలో రూ.6.40 లక్షలకు శ్రీవెన్ ఫార్మా డైరెక్టర్ రుద్రరాజు సూర్యనారాయణ రాజు లడ్డూను కైవసం చేసుకున్నారు. – మాదాపూర్, సెప్టెంబర్ 15



## ఫ్రెండ్స్ వినాయకుడి లడ్డూ@రూ.3.15 లక్షలు

ప్రశాంత్‌నగర్‌లోని ఫ్రెండ్స్ గణేశ్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ రూ.3.15 లక్షలు పలికింది. కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వేలం పాట నిర్వహించారు. పూజలందుకున్న వినాయకుడి లడ్డూకు వేలం హోరాహోరీగా జరిగింది. చివరకు కాలనీకి చెందిన జుంగిపల్లి సాకేత్ రాజ్ రూ.3.15 లక్షలకు లడ్డూను దక్కించుకున్నాడు.
– వనస్థలిపురం, సెప్టెంబర్ 15



హబ్సిగూడ డివిజన్ సాయి సుఖ విస్తాట్స్‌లోని వినాయక మండపం వద్ద జరిగిన లడ్డూ వేలం పాటలో రూ.2 లక్షల 61 వేలకు ఇందర్‌పాల్ సింగ్ లడ్డూ దక్కించుకున్నారు.
– రామంతాపూర్, సెప్టెంబర్ 15



## కిస్మత్‌పూర్‌లో రూ.3.5 లక్షలకు లడ్డూ..

కిస్మత్‌పూర్ హనుమాన్ దేవాలయంలోని లడ్డూను రూ.3.5 లక్షలకు కైవసం చేసుకున్న నంకాల భాస్కర్‌రెడ్డి

# రూ.లక్షలు పలికిన దుండిగల్ లడ్డూలు

దుండిగల్, సెప్టెంబర్ 15: దుండిగల్ పరిధిలోని వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూల ధరలు లక్షల రూపాయలు పలికాయి. వేడుకలు ముగింపునకు చేరడంతో భక్తులు పలు ప్రతిమలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిమజ్జనానికి తరలించారు. ప్రధానంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంతి హిల్స్‌లోని గణేషుడి లడ్డూ అత్యధికంగా రూ.6 లక్షల 60వేలు పలికింది. దీనిని సత్య నారాయణ రాజు, నాగరాజు అనే భక్తులు వేలం పాటలో కైవసం చేసుకున్నారు.

**ఆయా ప్రాంతాలల్లో లడ్డూల ధరలు ఇలా..**

1. నిజాంపేట్ ప్రశాంతి హిల్స్, రూ.6,60,000/–(సత్యనారాయణ రాజు, నాగరాజు)
2. బాచుపల్లి రెసీనా స్కైన్, రూ.6,03,500/– (కొలను వివాన్ రెడ్డి)
3. ప్రగతినగర్ యువజన సంఘం, రూ.5,90,000/– (జి.గౌతంరెడ్డి)
4. బాచుపల్లి పూజితా ఎన్‌క్లేవ్, రూ.5,11,111/– (మాధవి, రవీంద్ర దంపతులు)
5. నిజాంపేట్ టెంపుల్ బస్టాప్, రూ.4,16,000/– (హరిప్రసాద్)



## గణ నాథునికి శంభీపూర్‌లో ప్రత్యేక పూజలు..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు కార్యాలయ ప్రాంగణంలోని మట్టి వినాయక మండపాన్ని రాష్ట్ర మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు, చామకూర మల్లారెడ్డి ఆదివారం సందర్శించి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. కాగా మాజీ మంత్రులతో పాటు బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, నందికంటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్‌తో పాటు దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. – దుండిగల్



## విఘ్నేశ్వరునికి ఎమ్మెల్సీ వాణీదేవి పూజలు

కాచిగూడలోని నింబోలి అడ్డా శ్రీసాయి గణేశ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక పూజలో ఎమ్మెల్సీ వాణీదేవి, ఓం ప్రకాశ్ యాదవ్, డాక్టర్ శిరీషా యాదవ్, రవీందర్ యాదవ్, తదితరులు

# జయహో.. విఘ్నేశ్వరా..



తొమ్మిది రోజులు భక్తి శ్రద్ధలతో కొలిచిన గణనాథుని నిమజ్జన నిమిత్తం నెక్లెస్ రోడ్‌లోని హుస్సేన్ సాగర్‌కు ఆదివారం తరలించిన అనంతరం, తన మదిలోని కోరికను తీర్చమని గణపయ్య చెవిలో గోప్యంగా చెబుతున్న ఓ యువ భక్తురాలు

నగరం తొమ్మిది రోజుల పాటు గణనాథుని కొలువులో భక్తి పారవశ్యం లో తలమునకలైంది. వినాయక నవ రాత్రి భక్తుల పూజాది కాలతో ఉత్సవా లు ఘనంగా జరిగాయి. నగరంలోని ప్రతి వీధిలో ఏర్పాటైన గణనాథుని విగ్రహం తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా వేడుకలు జరుపుకుంది. చిన్నలు, పెద్దలు అంతా భక్తి పారవశ్యంతో గణేశ్ మహరాజ్ కీ జై అంటూ పెద్ద పెట్టున తొమ్మిది రోజుల పాటు నినదించి తమ భక్తి ప్రాతివత్యాన్ని చాటుకున్నారు. ఆ లంబోదరుడికి పెక్కు ఆహార పానీయాలైన ఉండ్రాళ్లు, కుడుములు, పాయసాలు, ఇష్టమైన పండ్లు, ఫలాలు అందించి యువత విఘ్నరాజాకు అత్యధిక పూజలు అందించి, తమ విఘ్నాలు తొలగిపోయేలా చూడాలని విజ్ఞప్తులు చేశారు. ఈ నేపథ్యంలోనే చిన్నారులు, యువత నుంచి వయోవృద్ధుల దాకా శివ పుత్రుడిని కొలిచి, తమ తమ కోర్కెలను తీర్చమని ఆ గంగా పుత్రుడికి చెవిలో రహస్యంగా వినిపించారు.



వినాయకులను హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు తరలివచ్చిన భక్తులు



హుస్సేన్ సాగర్‌కు నిమజ్జనానికి విఘ్న రాజాలతో తరలివచ్చిన చిన్నారులు

## నగరం నలుమూలల నుంచి హుస్సేన్ సాగరానికి..



రాయదుర్గం– షేక్‌పేట పరిధిలోని మల్కం చెరువుకు గణనాథులతో తరలివచ్చిన చిన్నారి భక్త బృందం



నెక్లెస్ రోడ్‌లోని హుస్సేన్ సాగర్‌కు విఘ్నేశ్వరున్ని తరలిస్తున్న యువత



నెక్లెస్ రోడ్‌లోని హుస్సేన్ సాగర్ జలాల్లోకి గణపతులను తరలిస్తున్న దృశ్యాలను తిలకిస్తూ తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్న భక్తులు



రాయదుర్గం– షేక్‌పేట పరిధిలోని మల్కం చెరువులో భక్తుల కోలాహలం మధ్య గణనాథుల నిమజ్జనం



నెక్లెస్ రోడ్‌లోని హుస్సేన్ సాగర్‌కు చిరు విఘ్నేశ్వరున్ని తరలిస్తున్న చిన్నారులు



నెక్లెస్ రోడ్‌లోని హుస్సేన్ సాగర్ జలాల మధ్యకు వెళ్లి విఘ్న రాజుకు నిమజ్జనం చేస్తున్న భక్తులు

## గురువులకు కంకణధారణ మహోత్సవం



ఏళేశ్వరపు చలపతి శాస్త్రికి గురురత్న అవార్డుతో సత్కరిస్తున్న కోలేటి దామోదర్ గుప్త, డా.సుబ్రహ్మణ్యం, తదితరులు

రవీంద్రభారతి, సెప్టెంబర్ 15: 'జై జవాన్ – జైకిసాన్ – జై కళాకార్' ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాలను పురస్కరించుకొని గురువులకు కంకణ ధారణ కార్యక్రమాన్ని రవీంద్రభారతిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు లయన్ కేవీ రమణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పూర్వ పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్త, డా.సుబ్రహ్మణ్యం (ఐఏఎస్–రి)లు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి పలువురు గురువులకు కంకణధారణ చేశారు. సభకు ముందు పలువురు విద్యార్థులు దేశభక్తి గీతాలు, కూచిపూడి, భరతనాట్యం శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించి వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో నాట్యగురువు పశుమర్తి శేషు బాబు, సుధాకర్, ఎం.అనిల్ గౌడ్, డా.ఏళేశ్వరపు చలపతి శాస్త్రి, దివ్యవాణి, వంశీ కృష్ణ పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో ఉచిత సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ కోర్సులకు శిక్షణ

కాచిగూడ, సెప్టెంబర్ 15: కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో లక్ష మంది విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ కోర్సులకు తెలంగాణ వ్యాప్తంగా ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ సాయి శ్రీమాన్ రెడ్డి తెలిపారు. కాచిగూడలో ఆదివారం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 100కు పైగా అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సులు, ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ విభాగం, డేటాసైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఒరాకిల్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ, విదేశాల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిప్లమా, పీజీ, ఇంజనీరింగ్ చదివిన యువకులు ఆన్‌లైన్‌లో ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నం. 95058 00050, www.nationalskillacademy.inలో సంప్రదించవచ్చని కోరారు.

## ఎల్బీ నగర్ మెట్రో స్టేషన్‌లో పాలీ హెల్త్ క్లీనిక్ ప్రారంభం




సిటీబ్యూరో, సెప్టెంబరు 15(నమస్తే తెలంగాణ)/ఎల్బీనగర్: దేశంలోనే మొట్టమొదటిసారిగా హైదరాబాద్ మెట్రో స్టేషన్లలో ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని మేయర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. మిట్టా ఎక్స్‌లెన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీ నగర్ మెట్రో స్టేషన్‌లో పాలీహెల్త్ క్లినిక్ అందుబాటులోకి వచ్చింది. ఇందుకు ముఖ్య అతిథిగా వచ్చిన మేయర్ లాంఛనంగా ప్రారంభించారు. మెట్రో ప్రయాణికులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు కూడా ఈ వైద్య సేవలను వినియోగించుకోవచ్చని ఆమె తెలిపారు. మొదటిసారిగా హెల్త్ ఏటీఎం కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. రక్త పరీక్షల డయాగ్నస్టిక్స్ సౌకర్యం, మెడికల్ షాప్, వైద్య నిపుణులు, ఫిజియోథెరపి, టెలీ మెడిసిన్, డెంటల్ కేర్ ఇలా అన్నీ మెట్రోస్టేషన్‌లో అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ సందర్భంగా ముసారంబాగ్ మెట్రో స్టేషన్ నుంచి ఎల్‌బీ నగర్ మెట్రోస్టేషన్ వరకు మెట్రో ట్రైన్‌లో మేయర్ పర్యటించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మిట్టా ఎక్స్‌లెన్స్ చైర్మన్ డాక్టర్ మిట్టా శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్లు నిఖిల్ కుమార్ రెడ్డి, నిఖితా రెడ్డి పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి రాజీనామా చేయాలి



రాజు నాయక్

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 15: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుపై మతిభ్రమించి మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తక్షణమే రాజీనామా చేసి, ముక్కు నేలకు రాయాలని ఓయూ జేఏసీ చైర్మన్, గిరిజన చైతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ కరాటే రాజు నాయక్ డిమాండ్ చేశారు. యాదాద్రి, వేములవాడ ఇతర దేవాలయాలకు మాజీ మంత్రి హరీశ్ రావు బినామీ డెయిరీల నెయ్యిని వాడుతున్నారని ఆరోపిస్తూ, మదర్ డెయిరీ ఎన్నికల కార్యక్రమంలో పాల్గొని హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కోమటిరెడ్డి తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఆరోపణలను నిరూపించలేని పక్షంలో మంత్రిపదవికి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. మదర్ డెయిరీ, విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారులకు గత ఏడు నెలలుగా పాల బిల్లుల చెల్లించడం లేదని మండిపడ్డారు. పాల ఉత్పత్తిదారులు తమ పాలనను ముఖ్యమంత్రి సొంత జిల్లా పాలమూరు జాతీయ రహదారిపై పోసి నిరసన వ్యక్తం చేశారని గుర్తు చేశారు.



## ఎస్కీలో ఘనంగా ఇంజనీర్స్ డే

సిటీబ్యూరో, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): ఇంజనీరింగ్ విద్యా మానవ మేధస్సుకు సవాలుగా మారుతుందని, ప్రపంచంలోని అద్భుతాలన్ని ఇంజనీరింగ్ టెక్నాలజీతోనే సాధ్యమైనట్లుగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జి.రామేశ్వర్ రావు అన్నారు. సెప్టెంబర్ 15న ఎస్కీలో ఇంజనీర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. కాలేజీ ఆవరణలోని ప్రముఖ ఇంజనీర్ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం, జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యలో సుమారు 15 విభాగాలు పనిచేస్తున్నాయని, స్పేస్ టెక్నాలజీ, సివిల్, మెకానికల్, కెమికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ తదితర విభాగాల ద్వారా ప్రపంచం మొత్తంలో ఇంజనీరింగ్ పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తుండటం వలన ప్రపంచం ఒక అత్యద్భుత ప్రగతిని సాధించిందన్నారు. భవిష్యత్తులో మరింత వేగం పుంజుకుంటుందని డా. రామేశ్వర్ రావు అన్నారు. 1981లో ఎస్కీని స్థాపించడం జరిగిందని, దక్షిణాసియాలోనే ఉన్న ఏకైక సంస్థలో 40 ఏండ్లుగా వేలాది మంది అభ్యర్థులకు ఇంజనీరింగ్‌కు సంబంధించిన విద్యలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో పలువురు ఇంజనీరింగ్ డాక్టరేట్లు, డా. కృష్ణప్రసాద్ రావు, డా. విద్యాసాగర్, డా. ప్రశాంత్, డా. ఏ.జగన్ మోహన్ రెడ్డి, డా. శ్రీధర్, డా. ఆదినారాయణ, డా. చంద్రకళ, లక్ష్మీకాంతారావు పలువురు పాల్గొన్నారు.